నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 సోమవారం 12 ఫిబ్రవరి 2024 MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

## కనుల పండువగా ప్రతిష్ఠాపన వేడుక

మంచిర్యాల ఏసీసీ, ఫిబ్రవరి 11 : మంచిర్యాల పట్టణంలోని నాలుగో వార్డులో గల కాశీ విశ్వేశ్వర అభయాంజనేయ స్వామి ఆలయంలో నాగేంద్ర సహిత శివలింగ, నందీశ్వర, గజస్తంభ ప్రతిష్ఠాపన వేడుక ఆదివారం కనుల పండువగా సాగింది. మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణానికి తనవంతుగా రూ.21 వేలు అందజేశారు. అనంతరం ఆలయ నిర్వాహకులు దివాకర్‌రావును శాలువాతో సన్మానించారు.



మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావును సన్మానిస్తున్న నిర్వాహకులు

## గోదావరిలో అమ్మవార్లకు అభిషేకాలు


చెన్నూర్ గోదావరిలో అమ్మవార్లకు అభిషేకాలు చేస్తున్న భక్తులు

కోటపల్లి, ఫిబ్రవరి 11 : ఎదుల్లబంధంలోని లక్ష్మీదేవర-ముత్యాలమ్మ జాతరను సోమవారం నుంచి నిర్వహించనున్నట్లు ఎంపీటీసీ జేక శేఖర్, జాతర నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆదివాసీ నాయక్‌పోడ్‌లు అమ్మవార్ల విగ్రహాలను చెన్నూర్ గోదావరి నదికి తీసుకొచ్చి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం తిరిగి ఆలయానికి విగ్రహాలను తీసుకొచ్చారు. పోచమ్మకు బోనాలు సమర్పించారు. జాతరకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరానుండగా, నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

# రైతుబంధు రాకపాయే..



## రెండు నెలలుగా ఎదురు చూస్తున్న రైతన్నలు

- యాసంగిలో మూడెకరాల లోపు ఇచ్చి ఆపేసిన కాంగ్రెస్ సర్కారు
- గత సీజన్‌లో ఈ సమయానికి డబ్బులిచ్చిన కేసీఆర్ ప్రభుత్వం
- అప్పు కోసం వడ్డీ వ్యాపారులు, దళారుల చుట్టూ తిరుగుతున్న అన్నదాతలు
- కాంగ్రెస్ సర్కారు తీరుపై దుమ్మెత్తి పోస్తున్న కర్షకులు

కుమ్రం భీం ఆసిఫాబాద్, ఫిబ్రవరి 11(నమస్తే తెలంగాణ) : కేసీఆర్ సర్కారు హయాంలో యాసంగి, వానకాలాలకు సంబంధించిన రైతుబంధు డబ్బులు రైతుల ఖాతాల్లో ఠంచన్‌గా జమయ్యేవి.యేడాదికి రెండు సార్లు(సీజన్‌కు రూ.5 వేల చొప్పున) రెండు సీజన్‌లకు రూ.10 వేలు వచ్చేవి. సాగుకు ముందే డబ్బులు బ్యాంకు ఖాతాల్లో జమ అవడంతో రైతులు కూడా పెట్టుబడికి ఢోకా లేకుండా సాగు చేసుకునే వారు. విత్తనాలు, ఎరువులు, రసాయనిక ఎరువులను కొనుగోలు చేసి నిశ్చింతగా ఉండేవారు. యాసంగి సీజన్‌లో ఈ సమయానికి భూములన్నీ పంటలతో కళకళలాడేవి. కాగా.. కేసీఆర్ సర్కారు ఈ యాసంగిలో రైతుబంధు డబ్బులు వేయడానికి సిద్ధమైంది. ఇంతలోనే అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ప్రక్రియ నిలిచిపోయింది. ఎన్నికల ప్రక్రియ పూర్తి కావడం, కాంగ్రెస్ పార్టీ అమలుకాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చింది. ఇప్పటివరకు మూడెకరాలు ఉన్న రైతులకు మాత్రమే డబ్బులను జమ చేసింది. అధికారంలోకి వచ్చి రెండు నెలలు దాటుతున్నా..అందరి ఖాతాల్లో డబ్బులను జమ చేయలేదు. దీంతో కొందరు రైతులు పెట్టుబడి కోసం దళారుల చుట్టూ తిరగాల్సి వచ్చింది. మరికొందరు పెట్టుబడి లేక పంటలు వేయలేదు. ఫలితంగా బీడు భూములు దర్శనమిస్తున్నాయి. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే సాయన్ని పంపిణీ చేయాలని రైతులు కోరుతున్నారు.

**కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లావ్యాప్తంగా** ఈ యాసంగి సీజన్‌లో 1,31,518 మంది రైతులకు రైతుబంధు రావాలి. వీరికి రూ.132.87 కోట్లు అందాలి. కానీ.. ఇప్పటివరకు 16,590 మందికి రూ.4.25 కోట్ల సాయం అందింది.

**మంచిర్యాల జిల్లాలో** 1,52,234 మంది రైతులకు రూ.169.98 కోట్లు రావాలి. ఇప్పటివరకు 1,15,932 మందికి రూ.72.50 కోట్లు మాత్రమే ఇచ్చారు.

**నిర్మల్ జిల్లావ్యాప్తంగా** 1.33 లక్షల మందికి సాయం అందింది. ఇంకా 55 వేల మందికి అందాల్సి ఉంది.

**ఆదిలాబాద్ జిల్లాలో** 1,64,124 మంది రైతులు రైతుబంధు పథకానికి అర్హులు. కాగా.. రూ.286 కోట్లు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ కావాలి.

### కాంగ్రెసోళ్లు నమ్మించి గొంతుకోసిన్రు



*పెంచికల్ పేట్, ఫిబ్రవరి 11 : నాకు ఎల్లూరు శివారులో ఐదెకరాలు ఉంది. వానకాలంలో వరి పండించిన. సరైన కొనుగోలు సెంటర్ లేక కిందా.. మీదా పడి మధ్యవర్తులకు పంట అమ్ముకున్న. గిట్టుబాటు ధర కంటే రూ. 100 తక్కువకే అమ్మాల్సి వచ్చింది. యాసంగి పంట వేద్దామంటే కరెంటు కోతలు మొదలైనయి. కాంగ్రెసోళ్లు అధికారంలోకి రావడం రైతులకు శాపంగా మారింది. గద్దె మీద ఎక్కగానే పెంచిన రైతుబంధుతో పాటు రూ. 2 లక్షలు రుణమాఫీ చేస్తామని నమ్మించి గొంతుకోసిన్రు. కనీసం ఇప్పటివరకు రైతుబంధుకు దిక్కులేదు. పెట్టుబడి అందక.. కరెంటు మీద నమ్మకం లేక యాసంగి రెండో పంట వేయలే. కాంగ్రెస్ సర్కారు పుణ్యామాని రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఇప్పటికైనా రైతులను ఆదుకోవాలె.*

**-ఖలీల్ బేగ్, రైతు, పెంచికల్‌పేట్**



### రైతులను గోస పెడుతున్రు



*పెంచికల్ పేట్, ఫిబ్రవరి 11 : కేసీఆర్ సర్కారులో పంటలకు ముందే రైతుబంధు డబ్బులేసేటోళ్లు. రంది లేకుంట ఎవుసం చేసుకునేటోళ్లం. కాంగ్రెస్ సర్కారు రాంగనే రైతులను గోస పెడుతుంది. నాకు బొక్కి వాగు ప్రాజెక్టు కింద ఐదెకరాల పొలముంది. ఎట్లనో అట్ల తిప్పల పడి పంట వేసిన. మందులు, కూలీలు, విత్తనాలకు అప్పు తెచ్చి పెట్టిన. కొత్త ప్రభుత్వం వచ్చి గిన్ని రోజులైనా రైతుబంధు వేయకపాయే. ఆనాడు కరెంట్ కోసం.. ఎరువుల కోసం చెప్పులు పెట్టి ధర్నాలు చేసినం. మళ్లా గసొంటి పరిస్థితే వస్తంది.*

**- చిన్నబోయిన చినన్న, రైతు, పెంచికల్‌పేట్**

### ఎవుసమెట్లనో..



*కౌటాల, ఫిబ్రవరి 11 : నా పేరు కొడిపే బుచ్చన్న. నాది కౌటాల గ్రామం. మా ఊరి శివారులో 6 ఎకరాలు ఉంది. తెలంగాణ వచ్చి కేసీఆర్ ముఖ్యమంత్రి అయినంక రైతుల బాధలన్నీ పోయినయి. పంట పెట్టుబడి కోసం శావుకార్ల చుట్టూ తిరగకుండా రైతుబంధు తీసుకొచ్చిండు. ఎకరానికి రూ. 5 వేల చొప్పున రెండు పంటలకు రూ. 10 వేలు ఇచ్చేటోళ్లు. పంట వేసే ముందే రైతుబంధు పైసలేసేటోళ్లు. గవ్విటితోనే విత్తనాలు, ఎరువులు కొనుక్కునేటోళ్లం. రంది లేకుంట ఎవుసం చేసేటోళ్లం. గిప్పుడు కాంగ్రెస్ సర్కారు వచ్చింది. గిప్పటిదాకా రైతుబంధు డబ్బులు పడలే. మళ్లా మునుపటి లెక్కనే అయ్యింది. పంటల సాగు కోసం శావుకార్ల దగ్గర మళ్లా అప్పులు చేయాల్సి వచ్చింది. కొందరైతే రైతుబంధు రాదంటున్నరు. పెట్టుబడి ఖర్చులు పెరిగిపాయే.. గిట్లయితే ఎవుసం ఎట్లా చేసుడో.. ఏమో..*

**- కొడిపే బుచ్చన్న, రైతు, కౌటాల**

### రైతులను గోస పెడుతున్నరు



*కౌటాల, ఫిబ్రవరి 11 : నా పేరు డుబ్బుల దేవాజీ. నాకు కౌటాలలో 5 ఎకరాల భూమి ఉంది. కేసీఆర్ సర్కారులో రంది లేకుంట ఎవుసం చేసుకున్నం. పంట వేసే ముందే రైతుబంధు ఇచ్చేటోళ్లు. గా పైసలతో మంచిగ విత్తనాలు, ఎరువులు కొనుక్కునేటోళ్లం. అధికారంలోకి వచ్చిన కాంగ్రెసోళ్లు గా మాటే ఎత్తుతలేరు. అప్పు తెచ్చి యాసంగి పంట వేసిన. రైతుబంధు కోసం నాలాంటి రైతులు ఎంతో మంది ఎదురుచూస్తున్నరు. ఇప్పటి వరకు 3 ఎకరాలు దాటిన ఏ ఒక్క రైతుకు కూడా పైసలు వేయలే. కేసీఆర్ సర్కారు రైతుల బాధలను తీర్చింది. గీ సర్కారోళ్లు రైతులను గోస పెడుతున్నరు. గిదేనా పాలన..*


అర్జున్‌రావు విగ్రహానికి పూలమాలలేసి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

## ఆదర్శప్రాయుడు అర్జున్‌రావు

**ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు**

మంచిర్యాలటౌన్, ఫిబ్రవరి 11 : ఆదర్శప్రాయుడు ముత్తినేని అర్జున్‌రావు అని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. మంచిర్యాల తొలి మున్సిపల్ చైర్మన్‌గా పనిచేసిన అర్జున్‌రావు ఎనిమిదో వర్ధంతి సందర్భంగా మంచిర్యాల పట్టణంలోని మహేశ్వరి మెడికల్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నేటితరం రాజకీయ నాయకులకు అర్జున్‌రావు ఆదర్శంగా నిలుస్తారని, ముక్కుసూటితనం, నిఖార్సయిన వ్యక్తిగా, మున్సిపల్ చైర్మన్‌గా ప్రజలకు ఎన్నో సేవలందించారని, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షునిగా, బీసీ నాయకునిగా ఎదిగి, రాజకీయ చైతన్యంతో పదవులను అలంకరించారని, హమాలీ సంఘం అధ్యక్షునిగా కూడా పనిచేశారని గుర్తు చేశారు. ఆయన సేవలను ఇప్పటికీ గుర్తు చేసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ వసుంధర, అర్జున్‌రావు కూతుళ్లు అత్తి సరోజ, హేమలత, కుమారులు రాంమోహన్‌రావు, రవికుమార్, మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.


బెల్లంపల్లి సీవోఈలో గురుకుల కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌ను పరిశీలిస్తున్న రూరల్ సీఐ అఫ్జలొద్దీన్

## ప్రశాంతంగా గురుకుల ప్రవేశపరీక్ష

బెల్లంపల్లిరూరల్, ఫిబ్రవరి 11: తెలంగాణ సాంఘిక సంక్షేమ, బీసీ సంక్షేమ, గిరిజన సంక్షేమ ప్రభుత్వ గురుకులాల్లో 2024-25 విద్యాసంవత్సరానికిగాను ఐదో తరగతిలో ప్రవేశాల కోసం ఆదివారం నిర్వహించిన ప్రవేశపరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఆదిలాబాద్ రీజియన్‌లోని ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో 8844 మంది విద్యార్థులకుగాను 8422 మంది హాజరయ్యారని ఆర్సీవో కే.స్వరూపారాణి తెలిపారు. బెల్లంపల్లిలో ఏర్పాటు చేసిన నాలుగు పరీక్షా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేశారు. బెల్లంపల్లిలోని పరీక్షా కేంద్రాలను గురుకులాల అసిస్టెంట్ సెక్రటరీ వెంకటేశం పరిశీలించారు. బెల్లంపల్లి సీవోఈని రూరల్ సీఐ అఫ్జలొద్దీన్ సందర్శించారు. నాలుగు కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. సీవోఈ కేంద్రానికి చీఫ్ సూపరింటెండెంట్‌గా ఐనాల సైదులు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌గా నస్పూరి నవ్యకుమారి, సిట్టింగ్ స్క్వాడ్‌గా ఆడెపు సాగర్‌లు వ్యవహరించారు. బెల్లంపల్లి బాలుర గురుకుల సంక్షేమ కళాశాలలో 480 మందికిగాను 455, బెల్లంపల్లి బాలికల గురుకుల సంక్షేమ కళాశాలలో480 మందికిగాను 456, కాసిపేట బాలుర గురుకుల కళాశాలలో 240 మందికిగాను 266, బెల్లంపల్లి ప్రభుత్వ బాలుర గురుకుల కళాశాలలో 288 మందికిగాను 270 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. రూట్ ఆఫీసర్లుగా యల్ల ఆనందరెడ్డి (ఆదిలాబాద్), గద్దె రాజ్‌కుమార్ (ఆసిఫాబాద్) కోటిచింతల మహేశ్వర్‌రావ్ (మంచిర్యాల) వ్యవహరించారు.

## నేడే ప్రజాదర్బార్

- ఐటీడీఏ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి
- మూడో రోజూ కొనసాగిన జాతర
- బాను, పెర్సపేన్‌లకు ప్రత్యేక పూజలు

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 11 : నాగోబా ఉత్సవాల్లో భాగంగా మూడో రోజైన ఆదివారం మెస్రం వంశీయులు ఆలయం వెనుక గల పెర్సపేన్(పెద్ద దేవుడు) దేవతకు సంప్రదాయ పూజలు నిర్వహించారు. డోల్, సన్నాయి, కాలికోమ్ వాయిస్తూ మెస్రం వంశీయుల పీఠాధిపతి వెంకట్‌రావ్‌పటేల్‌తోపాటు మెస్రం వంశీయుల పటేళ్లు చిన్ను పటేల్, బాజీరావ్ పటేల్ ఆధ్వర్యంలో కోసు కటోడ, కటోడ కోసేరావ్, కటోడ హనుమంత్‌రావ్ పూజలు చేశారు. గోదావరి నుంచి తీసుకొచ్చిన గంగా జలంతో పెర్సపేన్‌కు జలాభిషేకం చేశారు. నవ ధాన్యాలతో నైవేద్యం వండి మొక్కులు చెల్లించుకుని, సహపంక్తి భోజనాలు చేశారు.

**బాన్ దేవతకు పూజలు**

నాగోబా ఆలయం వెనుక భాగంలో ఉన్న బాన్ దేవతలకు మెస్రం వంశీయుల మహిళలు గిరిజన సంప్రదాయం ప్రకారం పూజలు చేశారు. గోవాడ్‌లో విశ్రాంతి పొందుతున్న మహిళలతోపాటు కొత్తకోడళ్లను సంప్రదాయ వాయిద్యాల మధ్య సతీదేవతల వద్దకు తీసుకొచ్చారు. గిరిజన మహిళలతోపాటు కొత్తకోడళ్లు మట్టికుండలతో కోనేరు వద్దకు వెళ్లారు. మెస్రం వంశీయుల అల్లుళ్లు నీటిని తోడి మట్టికుండలతోపాటు బిందెల్లో నీరుపోశారు. అనంతరం మహిళలు మట్టికుండలను తలపై పెట్టుకుని బాన్‌దేవతల వద్దకు వచ్చారు. నీటిని కలుపుతూ ఏడు వరుసలతో కూడిన బౌలదేవతను తయారు చేశారు. వీటికి కొత్తకోడళ్లు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. కాగా.. గోవాడ్‌లో కొత్త కోడళ్లకు నాగోబా చరిత్ర, సంస్కృతీ సంప్రదాయాలను మెస్రం వంశీయుల ఆధ్వర్యంలో పర్ధాంజీలు మెస్రం రాము, గంగారాం కిక్రి వాయిస్తూ అవగాహన కల్పించారు.


పెర్సపేన్ దేవతకు నైవేద్యాలు సమర్పిస్తున్న కటోడ కోసు


బాన్‌దేవత పూజలకు వచ్చిన మహిళలు

**నేడే ప్రజాదర్బార్**

నాగోబా జాతర సందర్భంగా ఐటీడీఏ ఆధ్వర్యంలో యేటా ప్రజాదర్బార్‌ను నిర్వహిస్తారు. ప్రజాదర్బార్‌కు మంత్రులతోపాటు జిల్లాస్థాయి అధికారులు హాజరై ఆదివాసీ గిరిజనుల సమస్యలను పరిష్కరిస్తారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో ప్రజా ఫిర్యాదుల విభాగాలను ఏర్పాటు చేసి దరఖాస్తులను స్వీకరిస్తారు. ఐటీడీఏ ద్వారా మంజూరైన సంక్షేమ పథకాలను అక్కడే పంపిణీ చేస్తారు.



జైపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

## కాంగ్రెస్ నాయకులపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలి

- బీఆర్‌ఎస్ నాయకుల డిమాండ్
- జైపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

జైపూర్, ఫిబ్రవరి 11: ఈ నెల 6న చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ చిత్రపటానికి చెప్పుల దండ వేసి అవమానించిన అగ్ర వర్ణాలకు చెందిన కాంగ్రెస్ నాయకులపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం మంచిర్యాల జిల్లా జైపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దళిత నాయకుడైన బాల్క సుమన్‌ను కులం పేరుతో దూషిస్తూ చిత్రపటానికి చెప్పుల దండ వేశారంటూ తమ వద్ద ఉన్న ఆధారాలతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బీఆర్ఎస్ నాయకులు మేడి తిరుపతి, రాజేశ్, స్వామి ఉన్నారు.

## భూ వివాదం

- పెంచికల్‌పేట్ గ్రామస్తులు-ఫారెస్ట్ అధికారుల మధ్య వాగ్వాదం
- ఫారెస్ట్ క్వార్టర్స్ కోసం తవ్విన పిల్లర్ గుంతలను పూడ్చివేసిన ప్రజలు

పెంచికల్‌పేట్, ఫిబ్రవరి 11 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్‌పేట్ మండల కేంద్రంలోని కాగజ్‌నగర్-పెంచికల్‌పేట్ ప్రధాన రహదారి సమీపంలోని హనుమాన్ విగ్రహం వెనుకాల గల ఖాళీ స్థలం విషయమై గ్రామస్తులు-ఫారెస్ట్ అధికారుల మధ్య వివాదం నెలకొంది. కొన్నేళ్లక్రితం రెవెన్యూ శాఖ వదిలేసిన స్థలాన్ని శ్మశానవాటిక కోసం గ్రామస్తులు ఉపయోగిస్తున్నారు. శనివారం ఇదే స్థలంలో క్వార్టర్స్ నిర్మాణం కోసమని ఫారెస్ట్ అధికారులు పిల్లర్స్ గుంతలు తవ్వించగా, గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఉదయం సుమారు వందమంది అక్కడికి చేరుకొని గుంతలను పూడ్చి వేస్తుండగా, ఫారెస్ట్ అధికారులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. దశాబ్దాలుగా ఈ స్థలాన్ని శ్మశాన వాటిక కోసం వినియోగిస్తున్నామని, ఇప్పుడొచ్చి మా స్థలం అని ఫారెస్ట్ అధికారులు అడ్డగించడం సరికాదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. 15 రోజుల క్రితం ఫారెస్ట్, రెవెన్యూ జాయింట్ సర్వే నిర్వహించినప్పటికీ సమస్యకు పరిష్కారం చూపలేదన్నారు. గ్రామస్తులంతా ఏమాత్రం వెనక్కి తగ్గకుండా గుంతలను పూడ్చివేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే ఇక్కడ క్వార్టర్స్ నిర్మాణం చేపడుతున్నామని ఇన్‌చార్జి ఎఫ్ఆర్వో సుధాకర్ తెలిపారు.


పెంచికల్ పేట్‌లో గ్రామస్తులు, ఫారెస్ట్ అధికారుల వాగ్వాదం

## సమ్మక్కకు మొక్కులు


తరాజులో బంగారం తూకం వేయించుకుంటున్న భక్తులు


నెత్తిమీద బంగారం ఎత్తుకున్న భక్తులు

*ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు సమ్మక్క-సారలమ్మల జాతర నేపథ్యంలో భక్తులు ముందుస్తు మొక్కులు తీర్చుకుంటున్నారు. ఈ మేరకు ఆదివారం మంచిర్యాల మార్కెట్‌లో బంగారం (బెల్లం) కొనుగోలు చేస్తూ కనిపించారు. ఎత్తు బంగారం తూకం వేసుకొని ఇళ్లకు బయలుదేరారు. ఏ దుకాణం ముందు చూసినా సందడి నెలకొంది. మంచిర్యాల గోదావరి ఒడ్డున ఉన్న సమ్మక్క-సారలక్కల గద్దెల వద్ద భక్తుల రద్దీ కనిపించింది.*

**- మంచిర్యాల, స్టాఫ్ ఫోటోగ్రాఫర్, ఫిబ్రవరి 11**

## శివాజీ స్ఫూర్తితో ముందుకెళ్లాలి

- సిర్పూర్(టీ) ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు
- నవేగాంలో ఛత్రపతి విగ్రహావిష్కరణ

సిర్పూర్(టీ), ఫిబ్రవరి 11 : ప్రతి ఒక్కరూ చత్రపతి శివాజీ స్ఫూర్తితో ముందుకెళ్లాలని సిర్పూర్(టీ) ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని నవేగాం గ్రామంలో ఆరె కుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం సమావేశంలో మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు సేవ చేసిన గొప్ప వ్యక్తి శివాజీ మహరాజ్ అని కొనియాడారు. ప్రజలంతా చైతన్యవంతులై గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రామస్తులకు సిర్పూర్(టీ) శివాజీ మండల కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.


శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే హరీశ్ బాబు

**పట్టణంలో భారీ ర్యాలీ...**

విగ్రహావిష్కరణ సందర్భంగా మండల కేంద్రంలోని శివాజీ విగ్రహం నుంచి నవేగాం వరకు ఆరెకుల సంఘం నాయకుల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ తీశారు. జై శివాజీ, జై భవానీ, హర హర మహదేవ్ నినాదాలతో యువకులు హోరెత్తించారు. జిల్లా ఆరె కుల సంఘం అధ్యక్షుడు బోట్టుపల్లి జైరాం, మండలాధ్యక్షుడు చన్కపురే శంకర్, ఎంపీటీసీలు సుహేల్ అహ్మద్, నవేగాం మాజీ సర్పంచ్ చిన్ను బాయి, నాయకులు నీరటి సత్యానారయణ, ఎల్ములే కిషోర్, నాయకులు పాల్గొన్నారు.